ఏటిగట్టు నిర్మాణ పనుల పరిశీలన

- అవినీతి రహితంగా నిర్మాణ పనులు
- చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు


నరసాపురం ఏటిగట్టు నిర్మాణ పనులు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: నరసాపురం గోదావరి ఏటిగట్టు ప్రాంత వాసులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం ఈ ఏటిగట్టు నిర్మాణ పనులకు ఇప్పటికే రూ26 కోట్లు కేటాయించిందన్నారు. పనులు పూర్తి కాకుండానే ప్రతిపక్ష పార్టీలు, నాయకులు అధికార పార్టీ పైనా, ఎమ్మెల్యేపైనా అనవసర రాద్ధాంతం చేస్తున్నారని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి గత ఏడాది ఏటిగట్టు కుంగిందన్నారు. దీంతో వెంటనే తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేశామని, శాశ్వత ప్రాతిపదికన ఏటిగట్టు పనులను పూర్తి చేయాలని, ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని నిధులు మంజూరు చేసిందన్నారు. మంజూరైన నిధులతో వెంటనే పనులు ప్రారంభించామని, ఇప్పటికే 60 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. శనివారం ఏటిగట్టు కుంగిన ప్రాంతాన్ని ప్రసాదరాజు అధికారులతో కలిసి సందర్శించారు. చేపట్టిన పనులకు ఇప్పటికీ బిల్లులు కాలేదని, అవినీతి జరిగిందని, ఎమ్మెల్యే బాధ్యత వహించి రాజీనామా చేయాలని కోరడం వారి అవగాహనా రాహిత్యానికి నిదర్శనమన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిన నిధులు ఏటిగట్టు మరమ్మతులకు సరిపోకపోతే, మరిన్ని నిధులు మంజూరు చేసేందుకు సీఎం జగన్ సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆందోళన వద్దు

నరసాపురం పట్టణ, ముఖ్యంగా పొన్నపల్లి వాసులు ఎటువంటి అపోహలు, ఆందోళనలకు గురికావద్దన్నారు. ఏటిగట్టు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో గోదావరి నదిలో సుమారు 60 అడుగులు లోతు ఉందని దీనికి తగ్గట్టుగా ఏటిగట్టు అధికారులు డిజైన్లు రూపొందించి చురుగ్గా పనులు చేస్తున్నారన్నారు. కోతకు గురైన ప్రాంతంలో గోదావరి నీటి ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. అందువల్ల గట్టు జారి ఉంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మిగిలిన, కోతకు గురైన ఏటిగట్టు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని, ఇందుకు అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై విలేకర్లు ప్రశ్నించగా ఏ మంచి పని చేసినా ప్రతిపక్షాల మెప్పు పొందలేమని, అదే పనిగా బురద జల్లే కార్యక్రమాలు పెట్టుకుంటారన్నారు. నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ప్రసాదరాజు వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, నరసాపురం సొసైటీ అధ్యక్షుడు షేక్ బులి మస్తాన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు భూసారపు జయప్రకాష్, చిన రెడ్డప్ప ధవేజీ, బర్రె జయరాజు, మల్లాడి బుజ్జి, వల్లభుని శేఖర్, చిట్టూరి కృష్ణ, కేసరి గంగరాజు, కావలి నాని, సోమరాజు దుర్గా భవాని, పతివాడ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన


ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం సంచార రథం వద్ద అధికారులు

పాలకొల్లు సెంట్రల్: ఓటింగ్ యంత్రం ద్వారా ఓటు ఎలా వేయాలో? ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని మునిసిపల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి అన్నారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం సంచార అవగాహన వాహనాన్ని ప్రారంభించారు. శేషాద్రి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఓటింగ్ యంత్రంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ సచివాలయాల్లో వీవీ ప్యాట్, ఈవిఎంల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించామన్నారు. ఈ సంచార రథాన్ని పలు కూడళ్లలో నిలిపి ప్రజలకు ఓటింగ్ యంత్రంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఓ వీరబ్రహ్మం, ఆర్ఐ శ్రీనివాస రాజు, డ్వాక్రా సీఎంఎం రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర


పెనుగొండలో పంచాయతీ సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్ శ్యామలాసోనీ

పెనుగొండ: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శనివారం పెనుగొండ పంచాయతీ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన నరేంద్ర మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ, బిజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, బీజేపీ పెనుగొండ, పెనుమంట్ర మండలాల అధ్యక్షులు దొడ్డిపట్ల నాగూర్, కర్రి ప్రసాద్ రెడ్డి, పొన్నాడ సురేంద్ర పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ల పంపిణీ


మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న సీఈవో శివశంకర్

పాలకొల్లు అర్బన్: వృత్తి నైపుణ్యతను పెంచుకుని ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా మహిళలు ఎదగాలని కనెక్ట్ ఆంధ్ర సీఈవో కోట్ల శివశంకర్ కోరారు. మండలంలోని శివదేవునిచిక్కాలలో శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడో విడతలో కుట్టు శిక్షణ పొందిన 30 మంది మహిళలకు కుట్టు మెషీన్లు, ధ్రువీకరణ పత్రాలను శనివారం ఆయన అందజేశారు. మహిళలు టైలరింగ్ సొసైటీగా ఏర్పడితే పాఠశాల విద్యార్థుల డ్రెస్‌లు కుట్టడానికి ఆర్డర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. స్కిల్ డవలప్‌మెంట్ అధికారి ఎ.కృష్ణారెడ్డి, మేనేజరు వడ్డె నారాయణ రావు, గ్రామ సర్పంచ్ దిడ్ల మణివజ్రం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సప్తాహ మహోత్సవాలు


సీతారాంపురంలో సప్తాహ మహోత్సవాల్లో భాగంగా కీర్తనలు పాడుతున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని సీతారాంపురంనార్త్ పంచాయతీలోని పట్టాభి రామాలయంలో 60వ సప్తాహ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సప్తాహ మహోత్సవాలు ఈ నెల 19 వరకూ జరుతాయని నిర్వాహకులు తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు ప్రత్యేపూజలు నిర్వహించి పవళింపు సేవలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భజనలు, హరికథలు, నాద స్వరం తదితర కార్యక్రమాలను వారం రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు, భజన కార్యక్రమం నిర్వహించారు. కంబాల సాయి బాబు, వెంకటలక్ష్మి దంపతులు పవళింపు సేవలో పాల్గొన్నారు.

కోడిపందేలు వద్దని సర్పంచ్ ఫిర్యాదు

పాలకోడేరు: మండలంలోని మండలం గొల్లలకోడేరు గ్రామంలో కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహించకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ కి, పాలకోడేరు పోలీసులకు సర్పంచ్ కుక్కల లక్ష్మి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి సంప్రదాయం ముసుగులో కోళ్లకు కత్తులు కట్టి నిర్వహిస్తున్న కోడి పందేలు జూద, క్రీడలకు కారణం ఎన్నో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గొల్లలకోడేరు గ్రామంలో ఇటువంటి జూదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక మహిళలు కోరికపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి: మండలంలోని వాండ్రంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న పది మందిని అందుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.73 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఏ సూర్య నారాయణ తెలిపారు.

కోడిపందేల బరుల ధ్వంసం



ఉండి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడి పందేలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవని డీఎస్పీ శ్రీనాథ్ తెలిపారు. శనివారం మండలంలోని మహదేవపట్నం, చినపుల్లేరు తదితర గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహించేందుకు సిద్ధః చేసిన బరుల డీఎస్పీ శ్రీనాథ్, ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ధ్వంసం చేశారు. ఎక్కడైనా కోడి పందేలు, జూదం వంటివి నిర్వహిస్తే తమకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలి గాని వ్యసనాల జోలికిపోయి జీవితాలు పాడుచేసుకోవద్దని హితవు పలికారు.

ప్రతి పేదవాడికీ నాణ్యమైన వైద్యం


ఆచంట సీహెచ్‌సీలో అత్యవసర విభాగాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


పెనుగొండలో ఆలయంలో రూ.1.50 కోట్లుతో నిర్మించిన వాసవీ నివాస్ సత్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో ప్రతి పేదవాడికీ నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం ఆచంట సీహెచ్‌సీలో రూ.82 లక్షలతో నిర్మించిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్ర అత్యవసర విభాగ భవనాన్ని ప్రారంభించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా పేదవాడి వైద్యానికి రూ.25 లక్షలు వరకూ ఖర్చు చేయడానికి ఆరోగ్య శ్రీలో వెసులుబాటు కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వేలాది జబ్బులను ఆరోగ్యశ్రీలో చేర్చారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సీఎం జగన్‌కు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఆచంట మండల కన్వీనరు, ఆచంట వేమవరం సర్పంచ్ జక్కంశెట్టి చంటి, ఆచంట సర్పంచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, సీహెచ్‌సీ కమిటీ సభ్యులు నల్లూరి చందు, దొమ్మేటి రాంబాబు, మాజీ ఎంపీపీ మట్టా ఆనందకుమార్, పెచ్చెట్టి సత్యనారాయణ గుబ్బల రామకృష్ణ, వేమన అప్పారావు, కుక్కల కిరణ్ కుమార్, గణేషుల సుబ్బారావు పాల్గొన్నారు.

వాసవీ నివాస్ ప్రారంభోత్సవం

శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో రూ.1.50 కోట్లుతో నిర్మించిన 16 వసతి గదుల వాసవీ నివాస్ సత్రాన్ని శనివారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రారంభించారు. ఆలయంలో నిత్యం వందలాది మందికి అన్నదానం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి కమిటీ మాజీ చైర్మన్ నూలి తాతాజీ, గ్రంధి రాము,, నూలి ధీరజ్, మండల కన్వీనర్లు బాబిరెడ్డి, పలివెల శ్రీను, పార్టీ నాయకులు కోట్ల మోహనరావు, ఎంపీటీసీలు నూలి భాను, తాడి సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

104 సేవల తనిఖీ


పెనుగొండలో 104 సేవలను తనిఖీ చేస్తున్న డీఎం మూర్తి

పెనుగొండ: 104 సేవలను ప్రజలకు మరింతగా చేరువ చేయడానికి కృషి చేస్తున్నట్లు డివిజనల్ మేనేజరు వైఎస్సార్ మూర్తి అన్నారు. శనివారం పెనుగొండ సచివాలయం-01లో 104 సేవలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వాహనంలో పరికరాలు, మందులు, వాహన సిబ్బందిని పరిశీలించారు. 104 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఈవో వర ప్రసాద్, పైలేట్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న వ్రత మహోత్సవాలు


విశేష అలంకరణలో వేంకటేశ్వర స్వామి

పెనుమంట్ర: మార్టేరు గ్రామంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని సామూహిక వ్రత మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఈ వ్రతంలో ధనుర్మాసం సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. స్వామివారిని తులసీ దళం, పుష్పాలతో అలంకరించి ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి వ్రత మహోత్సవాన్ని నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా మమివారి ఆలయంలో ఆదివారం సాయంత్రం గోదాదేవి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కలగల చినబాబు తెలిపారు.

నేటి నుంచి అయ్యప్పస్వామి తీర్థ మహోత్సవాలు


మార్టేరులో శ్రీఅయ్యప్పస్వామి ఆలయం

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు గ్రామంలో ఉన్న శ్రీఅయ్యప్ప స్వామి 18వ తీర్థ మహోత్సవం ఈ నెల 14నుంచి 16 వరకు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవాసమితి సభ్యులు శనివారం విలేకరులకు తెలిపారు. 14న ఉదయం అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మేళతాళాలు, బుట్టబొమ్మలతో గ్రామోత్సవం, 15న ఉదయం గోపూజ, స్వామివారికి అభిషేకం, చందన అలంకరణ దర్శనం ఉంటుందన్నారు. మధ్యాహ్నం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, సాయంత్రం పడిపూజ, జ్యోతి దర్శనం, అలంకరణ దర్శనం, అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ఆలయ ఆవరణలో కూచిపూడి జానపద నృత్య ప్రదర్శన కార్యక్రమాలు జరుగుతాయని 16న మాలికాపురతమ్మకు విశేష పూజలు నిర్వహించి, అమ్మవారి పల్లకీ ఉత్సవం చేస్తారని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

గ్రామాల్లో అమ్మవార్ల జాతర సందడి


పెనుమంట్రలో అమ్మవారిని పూరింటికి తీసుకువస్తున్న దృశ్యం.

మొగల్తూరు: రామన్నపాలెం పంచాయతీ పులపర్తి వారితోటలోని శ్రీగుడవల్లమ్మ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతీ ఏటా సంక్రాంతి పండుగ నేపథ్యంలో భోగి రోజున రాత్రి అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీ. జాతర సందర్భం ఆలయానికి రంగులు వేయడం, చలువ పందిళ్లు వేయడం, విద్యుత్ దీపాలకరణలు పూర్తయ్యాయని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామంలో వేంచేసియున్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 14 నుంచి 16 వరకు గ్రామ నడివీధిలో ఉన్న పూరిగుడిసె వద్ద నిర్వహిస్తామని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ తమనంపూడి సాయినారాయణరెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం అమ్మవారిని మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, గరగనృత్యాలు బాణసంచా కాల్పులతో గ్రామంలో గరగలను ఊరేగింపుగా తీసుకుని వచ్చి పూరి గుడిలో ఉంచారు. ఈ నెల 16 వరకు అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తామని తెలిపారు.

ముగిసిన రీ యూనియన్ క్రికెట్ మ్యాచ్‌లు


విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం రీ యూనియన్ క్రికెట్ మ్యాచ్‌లు డీఎన్ఆర్ కాలేజీ గ్రౌండ్స్ లో ఘనంగా ముగిశాయి. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భీమవరం గ్రీన్స్ జట్టుపై భీమవరం బ్లూస్ జట్టు విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భీమవరం గ్రీన్స్ జట్టు 25 ఓవర్లలో 147 పరుగులు చేయగా భీమవరం బ్లూస్ జట్టు 21 ఓవర్లలో రెండు వికెట్లు నష్టపోయి 148 పరుగులు చేసి విజయం సాధించింది. ముగింపు సభలో జట్టు విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో డీఎన్ఆర్ కళాశాల సెక్రటరీ గాదిరాజు బాబు, బీజేపీ నాయకుడు పాకా వెంకట సత్యనారాయణ, ద్రోణాచారయ్య అవార్డు గ్రహీత గంగోలి ప్రసాద్, మాజీ రంజీ క్రీడాకారులు మంగేష్, శివరామరాజు, గ్రంధి చల్లారావు, మానేపల్లి సూర్య మాణిక్యం, డీఎస్ రాజు, గుణేశ్వరరావు, వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా గ్రంధి చల్లారావు, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా కె.సతీష్, బెస్ట్ బౌలర్‌గా బాషా, ఫ్రెండ్ బెస్ట్ ప్లేయర్స్‌గా ఎస్.కృష్ణ మోహన్, నాచు రవి, బెస్ట్ క్యాచ్ పట్టినందుకు జి.శేఖర్ రాజులకు మెమెంటోలు, షీల్డ్ అందజేశారు.

జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు


నారిసమెరకలో కోడి పందేల బరులలో వేసిన టెంట్‌లను తొలగిస్తున్న పోలీసులు

యలమంచిలి: సంక్రాంతి పేరు చెప్పి గ్రామాలలో జూద క్రీడలు నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పాలకొల్లు రూరల్ సీఐ కుడిపూడి సతీష్ హెచ్చరించారు. మండలంలోని కట్టుపాలెం, మట్లపాలెం, యలమంచిలి, కలగంపూడి తదితర గ్రామాలలో వేసిన కోడి పందేల బరులను శనివారం ఆయన ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయం పేరుతో చట్ట విరుద్ధమైన కోడి పందేలు, గుండాట, కోతాట, పేకాట వంటి జూద క్రీడల నిర్వహించవద్దని ఆయన హెచ్చరించారు. ఈ జూద నిర్వహించడమే కాదు చూడడం కూడా నేరమన్నారు. ఇటువంటి శిబిరాల్లో దొరికితే కేసులు నమోదు చేస్తామన్నారు. అందువల్ల జూద క్రీడల జోలికి పోవద్దని ఆయన కోరారు. ఆయన వెంట యలమంచిలి ఎస్సై కాకి శివనారాయణ, సిబ్బంది ఉన్నారు.

నేడు గోదా రంగనాథుల కల్యాణం

మొగల్తూరు: గ్రామంలోని శ్రీరామాలయ, రుక్మిణీసత్యభామాసమేత రాజగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం గోదా రంగనాథుల తిరు కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సుదర్శనం లక్ష్మీ నరసింహాచార్యులు శనివారం విలేకరులకు తెలిపారు. కల్యాణం సందర్భంగా పీటల మీద కూర్చునే దంపతులు ఉదయమే ఆలయ నిర్వాహకులను సంప్రదించాలని, కల్యాణానికి హాజరైన భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ


మావుళ్లమ్మవారికి బంగారం సమర్పిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మకు హైదరాబాద్‌కు చెందిన సుందర మహతి, కుటుంబ సభ్యులు శనివారం 14 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజి అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు మావుళ్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పారదర్శకంగా ఏటిగట్టు పనులు


ఏటిగట్టు పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నరసాపురం రూరల్: నరసాపురం గోదావరి ఏటిగట్టు రక్షణ పనుల క్వాలిటీలో ఎక్కడా తేడా లేదని, పనులు రాజీ లేకుండా పారదర్శకంగా జరుగుతున్నాయని ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనావాసరావు అన్నారు. ఏటిగట్టుకు ఆనుకుని ఉన్న ప్రజానీకం ఎవరూ ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. శనివారం రాత్రి భీమవరం ఆర్డీఓ కె.శ్రీనివాసులుతో కలిసి ఏటిగట్టు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఇంకా 40 శాతం పనులు జరగాల్సి ఉందన్నారు. గట్టు నిర్మాణ పనుల్లో భాగంగా వేసిన రాళ్లు నీటిలోకి వెళ్లి సర్దుబాటు జరిగే క్రమంలో కుంగడం జరగడం సర్వ సాధారణమని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలో గోదావరి నది ఒంపు తిరిగి ప్రవహిస్తున్నందున ప్రవాహ వేగానికి మరిన్ని రాళ్లు లోపలికి వెళుతున్నాయన్నారు. నీటి ప్రవాహాన్ని అడ్డుకునే సామర్థ్యం కలిగిన రాళ్లనే గట్టు నిర్మాణానికి వాడుతున్నామని, టెక్నికల్ సిబ్బంది ఎప్పటికప్పుడు రాళ్ల నాణ్యతను పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. గోదావరికి గత సంవత్సరం వచ్చిన గోదావరి వరద 1986 వరదలను తలపించే విధంగా వచ్చిందని, ఆ వరద తాకిడికి దెబ్బతిన్న ఏటిగట్టు నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కృషి వల్ల నిధులు మంజూరు కావడంతో ఆ పనులు అరవై శాతం జరిగాయన్నారు. ఆర్డీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఫైర్, పోలీసు సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఈ వెంట డీఈ జి.శ్రీనివాస్, ఏఈ సుబ్బారావు తదితరులు ఉన్నారు.